అనుకోండి, గురువు ఏమి చేస్తాడు అంటే ఏదో వేపచెట్టు వేసావులే, మంచిపని చేసావులే, ఇదే సర్వస్వం అనుకోకు, నువ్వు పొందవలసింది వేరే ఉంది, ముందుకు నడువు అని నిన్ను గెంటుకొంటూ ముందుకు పోతాడు, వాడు గురువు. రమణభగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఈ దేహమే సత్యం, ఈ లోకమే సత్యం అని ఈ దేహం మీద, ఈ లోకం మీద నీకు సత్యబుద్ధి ఉన్నంతకాలం, ఇదే సత్యం అనుకొన్నంతకాలం నీ మనస్సు లోపలకు వెళ్లదు, నీకు ఆత్మజ్ఞానం కలుగదు, ఇలా నీవు కోటి జన్మలు ఎత్తినా నీ గతి ఇంతే. మనస్సుకు లోచూపు నేర్పు, మనస్సు దాని మూలమైన హృదయంలో అది నిలబడి ఉండేటట్లు చూడు. హృదయంలో మనస్సును ఉంచటం వలన అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది, అప్పుడు అక్కడ ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-12-04, చిన అమిరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇది దత్తసాయి మందిరం. దత్తాత్రేయుడి యొక్క అంశే షిరిడీ సాయిబాబా అని చెపుతారు. దత్తాత్రేయుడు అంటే అత్రిమహర్షికి దత్తుడుగా వచ్చిన నారాయణుడే దత్తాత్రేయుడు. దత్తాత్రేయుడు మహాగురువు. గురువు అంటే అక్కడ రెండు కాళ్ళు, రెండు చేతులు పెట్టుకొన్న మామూలు వ్యక్తిగా చూడనక్కరలేదు. గురు స్వరూపం అంటేనే జ్ఞాన స్వరూపం, శాంతి స్వరూపం. దత్తాత్రేయుడు దగ్గర ఎప్పుడూ కల్లుకుండలను పెట్టుకొని ఉండేవాడు. ఈ తాగుబోతు మనకు గురువు ఏమిటి అని మామూలు జనం ఆయనను చూసి వెళ్ళిపోయేవారు. ఆయన యొక్క విలువ, ఆత్మజ్ఞానం యొక్క వైభవం తెలిసిన వారు ఆయన దగ్గరకు వచ్చి ఆయన బోధను వినేవారు అంటే లోతుమనుషులు మాత్రమే ఆయనను ఆశ్రయించి జ్ఞానాన్ని సముపార్జనచేసి మోక్షాన్ని పొందారు. దత్తుడిని స్మరించుకొంటూ ఉంటేనే చాలామందికి అనేక మహిమలు జరిగాయి. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అదే బ్రహ్మం. ఆ బ్రహ్మం యందు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కల్పించబడ్డాయి. ఏ బ్రహ్మం యందు ఈ మూడు కల్పించబడ్డాయో ఆ బ్రహ్మజ్ఞానం కావాలంటే, మీరు బ్రాహ్మీస్థితిని పొందాలంటే సుబ్రహ్మణ్యుడిని ఆరాధించమని పెద్దలు చెపుతారు, అది పారమార్థికం. ఇంక లౌకిక విషయాలలో మీ ఇంట్లో పెండ్లి ఆలస్యం అవుతూ ఉంటే, మీకు సంతానం లేకపోతే సుబ్రహ్మణ్యుడిని ఆరాధించమని పెద్దలు చెపుతూ ఉంటారు. శివుడి యొక్క మరో రూపమే సుబ్రహ్మణ్యుడు.

అందరకు జ్ఞానం కలగాలి, శాంతి కలగాలి, బ్రహ్మానందానికి అందరూ వారసులు అవ్వాలి అయితే లోపం ఏమిటి అంటే చదువుతున్నాము, పారాయణలు చేస్తున్నాము, సాధన చేస్తున్నాము కాని మనకు శ్రద్ధ లేదు. శ్రద్ధలేకపోతే జ్ఞానంరాదు. పెద్దలు చెప్పిన మాటలు వింటున్నాము కాని మనకు ఉండవలసినంత శ్రద్ధ లేదు. భగవంతుడు మనకు కొన్ని తెలివితేటలు ఇచ్చాడు కాని

వాటిని ఎలా ఉపయోగించుకోవాలో మనకు తెలియటం లేదు అంతేకాదు ఇంకా తెలివితేటలు ఇమ్మని భగవంతుడిని అడుగుతున్నాము. ఉన్న తెలివిని ఉపయోగించుకోవటం లేదు ఇంకా ఇచ్చెయ్యి, ఇంకా ఇచ్చెయ్యి అంటే ఇస్తే వాటిని ఏమి చేసుకొంటారు. మనకు ఉన్న తెలివిని సద్వినియోగం చేసుకోవాలి. మనం బాగుపడటానికి, సమాజం బాగుపడటానికి మన తెలివిని ఉపయోగించాలి. మనం అంతా కుబేరులము కాకపోయినా మనకు ఎంతో కొంత ధనాన్ని భగవంతుడు ఇచ్చాడు. ఈశ్వరుడు మనకు ఇచ్చిన ఐశ్వర్యాన్ని ఎలా ఉపయోగిస్తున్నాము, దానిని సద్వినియోగం చేస్తున్నామా, ఆయనను తెలుసుకోవటానికి ఉపయోగిస్తున్నామా, ఆయన ఇచ్చిన ధనంతో మంచి పనులు చేస్తున్నామా లేక చెడ్డపనులు చేస్తున్నామా. ఇవి ఏమీ చూసుకోకుండా ఇంకా డబ్బు ఇచ్చేయి, ఇంకా డబ్బు ఇచ్చేయి అంటే ఆ డబ్బు వలన మనం పాడైపోతూఉంటే ఆ డబ్బును మనం ఏమి చేసుకొంటాము. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూ ఇంకా మంచి అవకాశములు ఇయ్యి, నా శరీరాన్ని మనస్సును పనిముట్టు కింద ఉపయోగించుకొని నా శరీరం ద్వారా పనిచెయ్యి అని భగవంతుడిని ప్రార్థించాలి. మనకు లేనిదానికోసం ఎదురుచూడకూడదు, ఉన్న దానిని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పుడు మనం ఏమి చేస్తున్నాము అంటే ఉన్న దానిని సద్వినియోగం చేసుకోవటం మానివేసి లేనిదానికోసం ఎదురుచూడటం, అది ఇయ్యి అని భగవంతుడిని అడగటం, ఇది భక్తుల లక్షణం కాదు.

కొంతమంది ఇతరులను చూసి అసహ్యించుకొంటారు, రోత పడతారు అది పనికిరాదు. ఇతరులను మనం అసహ్యించుకోకూడదు. ఇతరులను ప్రేమించాలి, ఆప్యాయంగా చూడాలి. ఎదుటివాడిలో ఉన్న మంచిని కూడా చెడ్డగా చెప్పేవారు అసూయపరులు, ఇతరుల వైభవాన్ని చూసి ఓర్వలేకపోవటం ఈర్ష్య. ఈలక్షణాలు ఆత్మ జ్ఞాన సముపార్జనకు ఆటంకాలు కాబట్టి వీటిలోనుండి మనం విడుదలపొందాలి. మనం కళ్యాణగుణాలను అలవర్చుకోవాలి, కళ్యాణగుణాలే ఆత్మకాకపోయినా కళ్యాణగుణాలు ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి కాబట్టి వాటిని మనం అలవర్చుకోవాలి. సద్వస్తువు మన హృదయంలోనే ఉంది. దాని దయ లేకుండా దానిని మనం పొందలేము. ఆ సద్వస్తువు మనకు తెలియబడాలి అని అది అనుకొంటే మనకు తెలియబడుతుంది కాని మనం అనుకొంటే అది తెలియబడదు అంటే మనం దాని దయకు పాత్రులం అవ్వాలి. కొంతమంది ఏదో విషయాలను ఊహించుకొని భయపడుతూ ఉంటారు, బెంగపెట్టుకొంటారు, ఊహించుకోవటంలో నుండి భయం వస్తోంది. మనం ఊహించుకోవటం మానివేయాలి. భగవంతుడి రూపం మన మనస్సులో ఉండాలి, ఆయన నామం మన నోటిలో ఉండాలి అలా ఉంటే మనకు లేనిపోని ఊహలు, సంకల్పాలు రావు. అప్పుడు భయం తగ్గిపోతుంది.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మిమ్మల్ని ఆయనే కాపాడుతాడు, అది మీకు తెలియక కంగారుపడుతున్నారు. హర్రీ వద్దు, వర్రీవద్దు. చితి శవాన్ని కాలుస్తుంది కాని

చింత జీవితం పొడుగునా కాలుస్తూ ఉంటుంది. ఆచింత పోవాలంటే గురువును ఆశ్రయించండి. మహాగురువును, దేవతాపురుషుడిని ఆశ్రయించి ఆ చింతను తొలగించుకోమని పెద్దలు చెపుతున్నారు. శారీరక రోగాలు ఉన్నవారు డాక్టర్ల దగ్గరకు ఎలా వెళతారో అలాగ మానసిక రోగాలు ఉన్నవారు అంటే మనస్సులో బాధపడేవారు మా దగ్గరకు వస్తారు. మేము నూటికి నూరు మందికి కాకపోయినా నూటికి తొంభైతొమ్మిది మందికి తగ్గించగలం, ఇది కూడా హాస్పటల్ వంటిదే, చింతకు సంబంధించినది. మన మాట కృత్రిమంగా ఉండకూడదు, మన జీవితవిధానం కృత్రిమంగా ఉండకూడదు. మనకు వైరాగ్యం ఉంటే అది సహజంగా ఉండాలి. ఒకసారి రామకృష్ణ పరమహంస భార్యను అడిగారు. లోకంలో చాలామంది వైరాగ్యపురుషులు ఉన్నారు. మీ ఆయనను చాలామంది దేవునితో సమానంగా పూజిస్తున్నారు. మిగతా వైరాగ్యపురుషులకు మీ ఆయనలో ఉన్న వైరాగ్యానికీ తేడా ఏమిటి అని శారదామాతను అడిగారు. ఆయన ఒక్కరే కాదు చాలామంది వైరాగ్య పురుషులు ఉండవచ్చు కాని ఆయన వైరాగ్యం సహజమైన వైరాగ్యం. తనకు వైరాగ్యం ఉందని తను అనుకోడు, తనకు వైరాగ్యం ఉన్నట్లు కూడా ఇతరులకు కనపడదు. మామూలుగా పురుషులు తమ భార్యలను ఎంత గౌరవంగా చూస్తారో అలాగే నన్ను కూడా ఆయన గౌరవంగా చూస్తారు, పైగా అప్పడప్పడు నాకు వస్తువులు కూడా కొంటారు. ఒకవేళ ఏమిటి పరమహంసగారు భార్యకు వస్తువులు కొన్నారు అని మీరు అనుకొంటే మీకు నోరు నెప్పికాని ఆయనకు ఏమీ ఉండదు. ఆ వస్తువు కొనటం కూడా వైరాగ్యమే. ఆయన వైరాగ్యం ఎంత సహజంగా ఉంటుందో ఆయన బోధ కూడా అంత సహజంగా ఉంటుంది.

మొదట్లో వివేకానందుడు నాస్తిక సంఘాలతో సహవాసం చేసేవాడు, అప్పటికి రామకృష్ణుడిని గురువుగా స్వీకరించలేదు మామూలుగా చూడటానికి వచ్చేవాడు. ఒకసారి రామకృష్ణుడితో ఏమండోయ్ మాకేమీ గుడ్డినమ్మకాలు లేవు అన్నాడు. రామకృష్ణుడి బోధలో ఉన్న ఆ నేచురాలిటీ చూడండి. మనిషికి కళ్ళు ఉన్నాయి కాని నమ్మకానికి కళ్ళు లేవే. నమ్మకానికి కళ్ళు ఉంటే ఆ కళ్ళు పోయినప్పడు నమ్మకం గుడ్డిది అవుతుంది. అసలు కళ్ళే లేనప్పడు నమ్మకానికి గుడ్డితనం ఎలా వస్తుంది నరేన్ అన్నాడు, అప్పడు నరేన్ బిగిసిపోయాడు. ఎక్కడ నుండి వచ్చిందో ఆ మాధుర్యం చూడండి, అభ్యాసంలో నుండి, వైరాగ్యంలో నుండి వచ్చింది. మనకు అందరికీ భక్తి ఉండాలి, తెలివి ఉండాలి. ఇవి రెండూ పరస్పర విరుద్ధాలు కావు. మనకు నిజమైన భక్తి ఉంటే తెలివి పెరుగుతుంది, మనకు నిజమైన తెలివి ఉంటే భక్తి పెరుగుతుంది. వాడు బాగా తెలివైన వాడు అనుకోండి, వాడికి భక్తి లేదు అనుకోండి లోపల వాడికి ఏదో బలహీనత, ఏదో తెలియనటువంటి లోపం ఉందని అర్థం. భక్తి తెలివి పరస్పరం సహకరించుకొంటాయి. పుట్టుకతో తెలివితేటలు వస్తే మంచిదే, లేకపోతే మనం తెలివితేటలు నేర్చుకోవాలి. నేర్చుకోవటం వలన కూడా మనకు ఎంతోకొంత తెలివి వస్తుంది. మన ఇంట్లో పేచీలు ఎందుకు వస్తున్నాయి, సమాజంలో ఇంత అశాంతి ఎందుకు

ఉంది, ఈ పరిస్థితికి కారణం ఏమిటి అని పరిశీలన చేయటం వలన కూడా మనకు తెలివి తేటలు పెరుగుతాయి. చింతాదీక్షితులుగారు రమణమహర్షిగారి దగ్గరకు వెళుతూ ఉండేవారు. సంవత్సరానికి ఒకసారో, రెండుసార్లో సెలవలు వచ్చినప్పడు నిన్నుచూడటానికి వస్తున్నాను, వెళుతున్నాను. నువ్వు తింటూ ఉంటే చూస్తున్నాను, మాట్లాడుతూ ఉంటే చూస్తున్నాను, నడుస్తూ ఉంటే చూస్తున్నాను అంతా బాగానే ఉంది అనుకొంటున్నాను చివరకు ఏమైంది అంటే నేను పోయాను, నీవు మిగిలావు ఇదేంటయ్యా ఇలా చేసావు అన్నారు అంటే మనస్సు పోయింది, ఆత్మ మిగిలింది. నేనేమీ పెద్ద తపస్సులు చేయలేదు, ఏదో సరదాగా మాట్లాడుతున్నావు అని నేను వస్తూఉంటే చివరకు ఇలా చేసావు. కొంతమంది చేసే తపస్సులలో కల్మషం ఉంటుంది. ఒక్క ఆత్మజ్ఞానసముపార్జన కోసం చేసే తపస్సులోనే, ఏ వస్తువుకయితే దుఃఖం లేదో, చావుపుట్టుకలు లేవో ఆవస్తువును పొందటం కోసం చేసే తపస్సు లోనే కల్మషం ఉండదు. కొంతమంది అధికారం కోసం, కొంతమంది ధనంకోసం, కొంతమంది విషయాలు సాధించటం కోసం ఇలా రకరకాలుగా తపస్సులు చేస్తూ ఉంటారు. ఇవన్నీ తపస్సులే కాని ఇలా లోకప్రయోజనాలకోసం చేసే తపస్సులలో దోషం ఉంటుంది. ఒక్క బ్రహ్మజ్ఞానం కోసం చేసే తపస్సులోనే దోషం ఉండదు, అది ఒక్కటే నిజమైన తపస్సు. నువ్వు ఏదిగా ఉన్నావో దానిని పొందటం కోసం చేసే ప్రయత్నమే నిజమైన తపస్సు, మిగిలిన తపస్సులలో దోషాలు ఉంటాయి.

మంచిమాటను మీరు శ్రద్ధగా వింటున్నారు అనుకోండి, మంచిమాటలను మీరు మననం చేసుకొంటున్నారు అనుకోండి, అప్పడు మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళటం ఆగిపోతుంది. పుణ్యప్రారబ్ధం ఒక రకంగా ఉంటుంది, పాపప్రారబ్ధం ఒక రకంగా ఉంటుంది. పుణ్యప్రారబ్ధం అహంకారానికే, పాపప్రారబ్ధం అహంకారానికే. మీరు జ్ఞానం సంపాదించినప్పడు దానిని మీరు ఒక దృశ్యం కింద చూస్తారు, ఆ ప్రారబ్ధం అనుభవించేటప్పడు కూడా అది మిమ్మల్ని అంటదు. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోండి, ఈ శరీరం ఉండగానే ముక్తిస్వరూపం పొందుతారు. మహాత్ములు చెప్పిన మాటలను శ్రద్ధగా వినండి, వాటిని మననం చేసుకోండి, మీకు తెలియకుండానే ఆ మాటలు మిమ్మల్ని హృదయం యొక్క లోతులలోనికి తీసుకొనిపోతాయి. అక్కడ ఉన్న పరమశాంతి, ఆనందం మీ సహస్రారానికి అందుతూ ఉంటుంది. అప్పడు శాంతి కోసం, ఆనందం కోసం సమాజం మీద కాని, బాహ్య సంఘటనల మీద గాని ఆధారపడవలసిన పనిలేదు. ఈ శరీరం భూమి మీద తిరుగుతూ ఉండగానే నిష్ప్రపంచస్థితిని అంటే ఈ ప్రపంచంలో ఉండగానే ప్రపంచం లేనిస్థితిని మీరు పొందుతారు. మన ఇంట్లో పేచీలు కూడా అవగాహనలోపం వలన వస్తాయి. కనిపిస్తున్న మనిషే నీకు అర్థంకానప్పడు కనిపించని దేవుడు నీకు అర్థమవుతాడా? మన హృదయంలో ఉన్న సత్యం మన ఇంద్రియాలకు, మన మనస్సుకు, తెలివికీ అందకపోవచ్చు కాని మన అనుభవానికి అందుతుంది. అది ఉంది కాబట్టి అందుతుంది లేకపోతే అందే సమస్యే లేదు.

ఈ ఉపన్యాసాలు చెప్పటం, రచనలు చేయటం, ఈ ఊరేగింపులు, ఈ సన్మానాలు జ్ఞానమా? కాదు మరి ఏది జ్ఞానం? మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అది ఎలా ఉందో నువ్వు అలాగ ఉంటే అది వయ్యా జ్ఞానం అంటే. జ్ఞానం సంపాదించటానికి మనం ఎక్కడికో పారిపోనక్కరలేదు, మీరు చిన అమిరంలో ఉండే పొందవచ్చు. ఎక్కడికో పారిపోతే జ్ఞానం వచ్చేస్తుంది అనుకొంటే అదోరకమైన మాయ. ఇప్పుడు సమాజంలో కొంతమంది మేము దుఃఖ పడుతున్నాము అని, మేము సుఖపడుతున్నాము అని అనుకొంటున్నారు. నేను ఇక్కడ బాబా సమక్షంలో చెపుతున్నాను మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే మీకు ఎంత దుఃఖం ఉన్నా అది పోవటమే కాదు, ఎవరయితే మీరు సుఖపడిపోతున్నారు అనుకొంటున్నారో వారి మీద వందరెట్లు మీరు సుఖి అవుతారు. మీ ఇంటి దగ్గర తినటానికి తిండి లేకపోయినా, మీకు పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకోవటం వలన మీ దుఃఖం అంతా పోవటమేకాదు, మీరు ఎవరైతే ఈ లోకంలో సుఖపడుతున్నారు అనుకొంటున్నారో వారు మిమ్మల్ని చూసి అసూయపడే స్థితికి మీరు ఎదుగుతారు, అదీ ఆత్మ విద్య. అలౌకిక సుఖం, అభౌతిక సుఖం, ఎంత అనుభవించినా తరగని సుఖంలో ఓల లాడతారు, అపప్పుడు ఒకవేళ మీ శరీరం రాలిపోతున్నా, శరీరంపోయింది అనే తలంపు కూడా నీకు రాదు, అట్టిది ఆ సుఖం.

మీరు పని దొంగలు అవ్వవద్దు. గీతలో భగవంతుడు ఏపని చెయ్యమని చెప్పాడో, ఎలా పని చేయమని చెప్పాడో అలా చేయండి. చెయ్యకూడని పని చేస్తే అది దోషం, చెయ్యవలసిన పని విడిచిపెడితే అది కూడా దోషమే అని చెపుతూ భగవాన్ ఇక్కడ చిన్న రహస్యం చెపుతున్నారు. ఇవి అన్నీ చేస్తూ ఉన్నా మీ లక్ష్యం మటుకు ఆత్మజ్ఞానసముపార్జన మాత్రమే, దానికోసం జీవించండి. మీరు అందరూ చనిపోవద్దు, బతకండి, భగవంతుడు మీకు కేటాయించిన పనులు చేయండి కాని మనస్సులో ఇదంతా నిజంకాదు అనుకోండి. మీకు 1000 కోట్లు డబ్బు ఉన్నా హృదయాంతరాళాలలో మటుకు ఇది నిజం కాదు అని అనుకొంటూ ఉండండి. ఒకవేళ మీ కుటుంబపరిస్థితులు బాగా ఉన్నా, మీరందరు బంగారు పిచ్చుకలు అయినా, మీ ఇంట్లోని వారందరు మంచివారు అయినా, అందగాళ్ళు అయినా, విద్యావంతులు అయినా సమాజంలో గౌరవం సంపాదించినా ఒక్కసారి మనస్సును లోపలకు పంపి ఇది అంతా నిజంకాదు, స్వప్న సమానము అనుకోండి. అలా అనుకోకపోతే మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఈ లోకమే నిజం, ఈ డబ్బే నిజం, ఈ శరీరమే నిజం, చావుపుట్టుకలే నిజం అనుకుంటే నీ మనస్సు లోపలకు వెళ్ళలేదు, లోపల ఉన్న బ్రహ్మం నీకు ఎరుకలోనికి రాదు. నిజంకానిదానిని నిజం అనుకొన్నంత కాలం మిమ్మల్ని చావుపుట్టుకలు విడిచిపెట్టవు. కర్మదోషాలు విడిచిపెట్టవు. ఏది నిజమో మనకు తెలియదు కాని మహాత్ములకు, జ్ఞానులకు నిజం ఏదో తెలుసుకాబట్టి మనలను అక్కడకు తీసుకొనిపోవటానికి ప్రయత్నం చేస్తారు. నిజంకానిదానిలో నుండి నెమ్మదిగా వేరుపడటం నేర్చుకోండి. ఈ దేహం నిజంకాదు,

ఈలోకం నిజంకాదు అని అనుకొంటూ ఏదయితే నిజంకాదో వాటిలోనుండి నెమ్మదిగా వేరుపడటం నేర్చుకొంటే ఇప్పుడు మనం ఏదైతే నేను, నేను అనుకొంటున్నామో ఆ నేను వేరుతో సహా నశిస్తుంది.

చావు పుట్టుకలకు, సుఖ దుఃఖాలకు, రాత్రిపగలుకు, నిద్రకి మెలుకువకు అన్నింటికి అతీతమైన వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. మనలోపల అది ఎలా ఉందో నువ్వు కూడా అలా ఉండగలిగితే అదే తపస్సు, అదే జ్ఞానం, అదే వైభవం. మీరు భగవంతుడిని ప్రార్థిస్తూ ఉండాలి. కోరికలేమీ పెట్టుకోకూడదు. కోరిక ఉంటే భయం, కోరిక లేనివాడికి భయం ఉండదు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీరు దేవతలను ఆరాధిస్తున్నారు అనుకోండి, ఆరాధించుకోవచ్చు కాని మాకు అది కావాలి, ఇది కావాలి అని అడగనక్కరలేదు. మీరు అడిగితే ఇచ్చినట్లు, అడగకపోతే ఇవ్వనట్లు కాదు. మనం అడగకూడదు ఎందుచేతనంటే మనకు ఏది మంచిదో మనకంటే ఆయనకే బాగా తెలుసు. మనకు ఎంత సేపు అడగటమే పని, అది కావాలి, ఇది కావాలి అని భగవంతుడిని అడుగుతాము. ఒకవేళ భగవంతుడు ఇస్తే ఇస్తాడు కాని దానివలన మీరు పాడైపోతారు అనుకొంటే గురువు మాత్రం ఇవ్వడు. ఒకడికి పేకాట ఆడే అలవాటు ఉంది అనుకోండి. తల్లితండ్రులను డబ్బు అడిగితే ఇస్తారా, ఇవ్వరు ఎందుకు పేకాట ఆడే అలవాటు మానిపించాలి అని చూస్తారు. అలాగే గురువు మీరు పాడైపోతారు అనుకొంటే అది ఇవ్వడు అంటే ఇవ్వలేక కాదు. నాకు ఆత్మ సాక్షాత్కారం కావాలి. ఆత్మశాంతి కావాలి అని కూడా అడగవద్దు. ఆ వస్తువు ఏదీ అడగదు అలాగే నువ్వు కూడా ఏదీ అడగవద్దు. అడగనంత మాత్రంచేత మీకు రాదని అనుకోవద్దు. మీకు యోగ్యత వచ్చినప్పుడు ఆ సద్వస్తువు మీకు ఎరుకలోనికి రావటానికి ఒక్కక్షణం కూడా వెయిట్ చెయ్యదు. మనం గురువును తిట్టినా, దేవుడిని తిట్టినా కాని ఆయన మనలను తిట్టడు సరికదా, మన క్షేమాన్ని కోరుతూ ఉంటాడు, వాడు గురువు.

మనం లోకానికి సంబంధించిన విషయాలు ఏవి కోరుకొన్నా వచ్చేజన్మలో అవే మనలను పీడించేస్తాయి. మనందరము కీర్తికోసం ఏడుస్తూ ఉంటాము. వివేకానందుడు కీర్తిని అనుభవించి ఈజీవుడికి కీర్తి అనే మట్టి అంటుకొంది, దానిని తొలగించి నన్ను శుభ్రం చెయ్యి, ఈ కీర్తి తాలుక సంకెళ్లను తెంపి నాకు స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, ఆనందాన్ని ప్రసాదించు అమ్మా అని కాళీమాతను ప్రార్థించాడు. మనం కూడా గొప్పలు కావాలి, కీర్తికావాలి అనుకొంటాము, అవి వస్తే చివరకు అవి కూడా బంధం కింద తయారవుతాయి. అందుచేత లోకానికి సంబంధించినవి ఏవి కోరుకొన్నా వాటిలో నుండి విడుదల పొందటానికి వచ్చేజన్మలో చాలా కష్టపడాలి. మీకు భగవంతుడి మీద ప్రేమ ఉండాలి, దానికి కారణం కనబడకూడదు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నోటికి పని తగ్గించండి, చేతులకు పని చెప్పండి అంటున్నారు కాని మనం చేతులకు పని చెప్పటం మానివేసి నోటికి పని చెబుతున్నాము. భగవంతుడు ఏది ఇస్తే దానిని మనం ప్రసాదం కింద స్వీకరించాలి. జీవితంలో ఏ సంఘటన జరిగినా

అది భగవంతుడికి తెలియకుండా జరగదు. ఆ సంఘటన నీకు పాఠం నేర్పి తప్పకొంటుంది, అది భగవంతుడి దయ. ఆ సంఘటనలను చూసి నీవు పొంగిపోవద్దు, కృంగిపోవద్దు. ఆ సంఘటనల నుండి పాఠాలు నేర్చుకొని బాగుపడు, నీ తెలివిని అక్కడ ఉపయోగించు. భగవంతుడికి తెలియనిదంటూ ఏమీలేదు, భగవంతుడు శక్తివంతుడు, జ్ఞానవంతుడు, మనకు ఏది ఎప్పుడు చెయ్యాలో అది చేస్తూ ఉంటాడు, మనం ఏమీ తొందరపడవలసిన పనిలేదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఒకటి దృష్టిలో పెట్టుకోండి, మీరు చేసేది త్రికరణ శుద్ధిగా చేయండి, అందులో లీనమై చెయ్యండి. దురదృష్టం ఏమిటి అంటే మనకు శ్రద్ధ లేదు, భక్తి లేదు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే భగవంతుడు చెప్పిన మాట యందు గౌరవం లేనప్పుడు, దానియందు శ్రద్ధలేనప్పుడు ఆ శబ్దం దేనిని పొందమని సూచిస్తోందో దానిని నీవు ఎలా పొందగలవు, దానిమీద విశ్వాసం లేనప్పుడు దానిని నీవు పొందలేవు. అందుచేత నీవు ఏ పనిని చేసిన శ్రద్ధతో, భక్తితో, నిండుమనస్సుతో అందులో లీనమై చెయ్యాలి. భగవంతుడి సంకల్పానికి లోబడి ఉండు. ఈగోడ ప్రక్కన ఏముందో మనకు తెలియదు కాని మన పూర్వజన్మలు, రాబోయే జన్మలు అన్నీ కూడా భగవంతుడికి తెలుసు. మీకు నచ్చని సంఘటన ఏదైనా జరిగింది అనుకోండి, కంగారుపడకండి, ఆ సంఘటన ద్వారా మీ జీవితాన్ని మలుపుతిప్పి మంచిగా భగవంతుడు మారుస్తాడు మీకు సహనం కనుక ఉంటే. అరుణగిరిని క్షమగిరి అని కూడా అంటారు. అంటే మనలో ఏదైనా పొరపాట్లు ఉన్నా వాటిని క్షమించి మన మొఖాన్ని జ్ఞానంవైపుకు తిప్పతాడు, వాడు అరుణాచలేశ్వరుడు.

మనలో బీజరూపంలో ఉన్న చిన్న వాసనలను కూడా ఏదో వంపు పెట్టి వాటిని బయటకు లాగి ఆ వాసన నీకు ఉంది అని తెలియజేసి నీ శరీరం స్మశానంకు వెళ్ళకముందే ఆ వాసనలను కాల్చి బూడిద చేస్తాడు, వాడు గురువు. గురువు అంటే మీకు అడిగినదల్లా ఇచ్చేవాడు కాదు, మిమ్మల్ని బాగుచేసేవాడు, మీకు జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు. షిరిడీబాబా చెపుతూ ఉండేవారు ఎప్పడయినా మీరు అడిగింది నేను ఇచ్చినా నా దృష్టి దాని మీద కాదు. మీకు భగవంతుడి మీద భక్తి కలగటానికి, శ్రద్ధ కలగటానికి అవి ఇస్తున్నాను కాని మిమ్మల్ని ఎక్కడికి తీసుకొనిపోవాలో నాకు తెలుసు అనేవారు. సాయి అంటే సర్వానికీ అతీతుడు. సాయిబాబా రూపాన్ని ఆరాధిస్తూ, ఆయనను నామాన్ని స్మరిస్తూ అక్కడే ఉండిపోకూడదు, నెమ్మదిగా ఆయన పాదాలను పట్టుకొని మన హృదయంలో ఉన్న తత్వం దగ్గరకు చేరుకోవాలి అంటే మన నిజమైన ఇంటికి మనం వెళ్ళి పోవాలి. చివరలో మీకు అందరికీ ఒక మాట చెపుతున్నాను ఎవరైనా వచ్చి మీరు అంతటి వారు, మీరు ఇంతటి వారు, మీరు గొప్పవారు అంటారు అనుకోండి, మీరు పైకి ఏమీ అనవద్దు కాని లోపల హృదయాంతరాళాలలో ఇది నిజం కాదు, ఇది నిజంకాదు అనుకోండి. ఏది నిజమో నాకు తెలియక పోయినా ఇది మటుకు నిజంకాదు అని అనుకోండి లేకపోతే మీరు దానితో కలిసిపోతారు, అదే మీరు అనుకొంటారు అందువలన బహుజాగ్రత్తగా జీవించండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-01-05 | శని | కొమరగిరిపట్నం, ప్రహ్లాదస్వామి ఆశ్రమం |
| 12-01-05 | బుధ | కాపవరం, గీతా భవనం |
| 16-01-05 | ఆది | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| 21-01-05 | శుక్ర | మల్కిపురం, సాయిబాబా మందిరం |
| 25-01-05 | మంగళ | తాడినాడ |
| 31-01-05 | సోమ | జువ్వలపాలెం |

# గురువాక్యం - ఆప్తవాక్యం

స్వార్థంలేని మనిషి ఎప్పడూ ఆప్తవాక్యాన్నే చెబుతాడు. గురువు కన్న ఆప్తులు ఈ లోకంలో మనకు ఎవ్వరూలేరు. తల్లి, తండ్రి, పాఠాలు చెప్పిన గురువు - ఋణం తీర్చుకోవచ్చుకాని, జన్మజన్మల నుంచి పోగుజేసుకున్న అజ్ఞానాన్ని తొలగించే సద్గురువు ఋణం తీర్చుకోలేము. సద్గురువులో పరోపకార దీక్ష, త్యాగం, వైరాగ్యం మూర్తీభవించి ఉంటాయి, వారు క్లిష్టమైన ఆత్మ విషయాలను విపులంగా అందరికీ అందుబాటులో ఉండేలా, సులభమైన మాటలతో చెబుతారు. చదువురాని వారికి కూడా వారి ప్రవచనం అర్థమౌతుంది. దాన్ని శ్రద్ధతో విని ఆకర్షింపబడతారు. అవి చైతన్యం నుంచి వచ్చిన మాటలు కాబట్టి మన జీవన విధానమే మారిపోతుంది. వారికి మనం కృతజ్ఞత కలిగి ఉండాలి. గురువు మాటలతోనే సరిపెట్టుకోరు శిష్యుని క్షేమం, పురోగమనం అనుక్షణం గమనిస్తూనే ఉంటాడు. ఉపదేశం పొందే సమయంలో అతని మనస్సు, బుద్ధి బైట ప్రపంచంతో ముడిపడి ఉంటుంది. అతని మనస్సును, ఇంద్రియములను అదుపులో ఉంచుకోవటం నేర్పుతూ, వాని బుద్ధిని ఆత్మపై కేంద్రీకరించటంలో సాయం చేస్తారు. ప్రారబ్దం రీత్యా ఎదుర్కొనే కష్టాలను తగ్గించి, కష్టాలను నవ్వుతూ అనుభవించే మనోబలాన్ని ఇస్తారు. వారి వాక్యాలు మనలో ఉత్సాహాన్ని కలుగజేస్తాయి. "గురువు యొక్క ఉపదేశం లేకపోతే కోటి జన్మలు గతించినా తత్త్వజ్ఞానం కలుగదు" అంటోంది గురుగీత. "కోటి పుస్తకాలు చదవటం కన్న గురు అనుగ్రహం, కోటిరెట్లు అధిక ఫలితం ఇస్తుంది. భగవంతుడు సత్యం, ఆయన మాటలు సత్యం అనే విశ్వాసం కలిగితే నీలో తూకం పెరిగి సత్యం దగ్గరకు ఆ మాటలు నిన్ను తీసుకొని వెళతాయి. "నాలో పవిత్రత ఉంటే నామాటలు మిమ్మలను జన్మజన్మలకు వెంటాడి తీరుతాయి" అన్నారు శ్రీ నాన్నగారు. అందుకనే అంటారు "గురువులేని విద్య గుడ్డివిద్య" అని జననమరణ చక్రమనే ఆపదలో పడకుండా ఆప్తులైన గురు వాక్యాలను మననం చేసుకొని ఆచరించి తరించాలి, అదే జీవిత గమ్యము.

**సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం




భగవాన్ శ్రీ రమణ మహర్షి 125వ జయంతి మహోత్సవ వేదికపై సద్గురు
శ్రీ నాన్నగారు, శ్రీ రమణక్షేత్ర అధ్యక్షులు పి.ఎస్.ఎన్.రాజుగారు





ది॥ 24-11-2004న అరుణాచలంలో
శ్రీ వై.ఎస్. ఖన్నాగారి గృహమునకు
శంఖుస్థాపన చేస్తున్న
సద్గురు శ్రీ నాన్నగారు